# చేపలు

"మావో...మాట...బేగిలారా..." అంటూ అరుస్తూ పిలిచింది లచ్చిమి.

"ఏటేటి?..." అంటూ లచ్చిమి దగ్గరకు వెళ్ళాడు సాంబయ్య.

"సూడు మావాఁ... ఈ సేపను కోత్తే దాని కడుపులో మరో సేపున్నాది!!"

"నీకు పెతీదీ ఇసిత్రవేఁ... పెద్దసేప సిన్న సేపను మింగుద్ది... గావుకేకేత్తే మరేటోననుకున్నా!... నేనెల్లొత్తా" అంటూ సాంబయ్య గుడిసె బయటికి వచ్చి అక్కడే ఓ ప్రక్క నిలబెట్టిన రిక్షా తీసుకుని మెయిన్ రోడ్డువైపు బయలుదేరాడు.

రేప్ చేయబడ్డ స్త్రీ హృదయంలా ఎండమండిపోతుంది. సాంబయ్య నిస్సత్తువగా రిక్షా లాక్కుంటూ వెళుతున్నాడు. ఒంట్లో జ్వరం వచ్చినట్లుగా ఉంది.

"ఇస్ ఎదవ ఎండ..." అనుకున్నాడు. నొసటను పట్టిన చెమటను ఎడమచేత్తో విదిలించాడు.

"ఎండనేదు... వాన్నేదు... రిచ్చా తొక్కాల్సిందే... దేవుడు పెత్తెచ్చమై వచ్చే జలమలో నిన్నేటిగా పుట్టించాల అనడిగితే రిచ్చా తొక్కేవోడిగా మాత్రం పుట్టించకు అని అడు

గుతా నానై తే... ఎదవ బతుకు... ఎదవ బతుకు నీ...'' అనుకున్నాడు మళ్లీ.

''ఏయ్ రిక్షా...'' ఎవరో పిలిచారు.

''సాంబయ్య తనను పిలిచిన వ్యక్తి దగ్గరకు రిక్షా తీసుకెళ్ళాడు.

''గవర్నమెంట్ ఆఫీసుకు వస్తావా ?...''

''అదెక్కడుంది బాబు ?...''

.. నీకు తెలీదా ?... సరే ముందు నువ్వు పోనీయ్... నీకు దారి నేను చెప్తాను'' అంటూ చలపతి రిక్షా ఎక్కాడు.

సాంబయ్య రిక్షా బరువుగా తొక్కసాగాడు. రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉంది. ఎదురుగాలి కూడా బాగా వీచసాగింది. అందుకనే రిక్షా తొక్కడం చాలా కష్టంగా ఉంది. బీచ్‌లో ఇసుక తవ్వితే నీళ్లూరే విధంగా అతని శరీరంలోనుండి చెమట ఊరుతోంది. పల్లానికి పారే నీరులా తారురోడ్డు రిక్షా క్రిందికి నెమ్మదిగా జారిపోతోంది. చలపతి దారి చెప్తుంటే సాంబయ్య రిక్షా తొక్కుతున్నాడు. కాస్సేపటికి గవర్నమెంటు ఆఫీసు వచ్చింది. చలపతి రిక్షా దిగాడు. సాంబయ్య నొసలుమీది చెమటను చేత్తోతీసి దులిపాడు.

''ఎంతిమ్మంటావ్ ?...'' జేబులో చెయ్యిపెడుతూ చలపతి ప్రశ్నించాడు.

... ''రూపాయిన్నర ఇప్పించండి...'' సాంబయ్య చలపతి వంక అలసటగా చూస్తూ అన్నాడు.

'రూపాయిన్నరా ?... ఒక మైలుదూరం అన్నా తొక్కావో లేదో... ఇదిగో రూపాయిపావలా తీసుకో...'' చలపతి సాంబయ్యా చేతిలో రూపాయిపావలా పెట్టి చకచకా ఆఫీసు గేటువైపు అడుగులు వేశాడు. సాంబయ్యకు పోట్లాడే ఓపికకూడా లేదు. తెలియని ప్రదేశానికి బేరం కట్టడం తనదే తప్పని అనుకుని తిట్టుకున్నాడు.

చలపతి తనుండే స్థలంనుండి గవర్నమెంటు ఆఫీసుకు చాలాసార్లు రిక్షాలో వచ్చాడు. రూపాయిన్నరకు తక్కువ ఏ రిక్షావాడూ రాడు. చలపతి రెండురూపాయలుకూడా ఇచ్చి వచ్చిన రోజులున్నాయి. సాంబయ్యా కొత్తవాడూ-మెత్తవాడూ కావటంచేత రూపాయిపావలా ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. పావలా అంటే చలపతికి అసలు లెక్కే లేదు. పావలా అన్నమాటేమిటి వంద రూపాయల నోట్లే అతనికి పావలాతో సమానం- కానీ సాంబయ్యకు ఆ పావలానే ఎంతో ఖరీదైనది. తనకు పనికిరానిది సాంబయ్యకు ఎంతో పనికివచ్చేది అయిన పావలాని చలపతి కొట్టేశాడు.

చలపతి పంచాయతీ రాజ్ డిపార్టుమెంటులోకి దూరాడు.

"నమస్తే సార్..." పైకి వినయం చూపిస్తూ "దొంగ ముండా కొడుకు" అని మనసులో తిట్టుకున్నాడు చలపతి.

అంతసేపూ ఆఫీసులో వారపత్రికలూ, హాడ్లీ చేజ్ నవల్లూ తిరగేస్తున్న ఉమాపతి చలపతిని అంతదూరంలో చూస్తూనే అవన్నీ టేబులు సొరుగులో పడేసి ఫైళ్లకట్ట ముందేసుకుని

వాటిల్లోకి తలదూర్చేసి చలపతి నమస్కారాన్ని అందుకున్నట్లుగా తల పైకీ కిందికీ ఊగించాడు.

చలపతికి డబ్బూ, పరపతి ఉన్నాయి. ఉమాపతికి అవి రెండూ లేవు కానీ చలపతికి అతని అవసరం ఉంది. అందుకనే ఉమాపతి బిగుసుకూర్చున్నాడు. చలపతి అతనిముందు చేతులు కట్టుకుని నిలుచున్నాడు.

"కూర్చోండి" అన్నాడు చలపతినుద్దేశించి ఉమాపతి.

కూర్చోమని అన్నాడు గానీ అక్కడ కుర్చీలేదు. ఒక మూల ఉన్న స్టూలును ఉమాపతికి ఎదురుగా లాక్కువచ్చి కూర్చున్నాడు చలపతి.

ఉమాపతి కాస్సేపు బిజీగా ఉన్నట్లు ఆఫైలూ ఈఫైలూ కెలికాడు. అందులో ఇందులో పెన్నుతో కాస్త గిరికాడు. మధ్య మధ్య ఊరికే నిట్టూరుస్తున్నాడు.

చెమట పట్టకపోయినా జేబురుమాలుతో అదేపనిగా ముఖం- మెడ తుడుచుకోసాగాడు. కాస్సేపైనాక "ఊ... చెప్పండి- చాల బిజీగా ఉన్నాను" అన్నాడు త్వరగా తేల్చి వెళ్ళిపొమ్మనే ఉద్దేశంతో.

"ఇంకా చెప్పేదేముందండీ... అదే... నా ఫైలు సంగతే..." అంటూ గొణిగాడు చలపతి.

"అవునండీ... మీరు చాలాసార్లు చెప్పారు- కాని మీ ఫైలుకంటే అర్జంటు ఫైల్సు ఇంకా చాలా ఉన్నాయి. ముందు వాటి విషయం చూడాలి. నాకేమో క్షణం తీరిక ఉండటంలేదు. అప్పటికీ ఇంటికికూడా కొన్ని ఫైల్సు తీసు

కెళ్ళి చూస్తున్నా... ఇంకో విషయం- మీ పనికూడా అవు తుందన్న నమ్మకం నాకు లేదు..." అన్నాడు ఉమాపతి.

"మీరలా అంటే ఎలాగండీ... మీరు నాకు ఫేవరబుల్ గా రాస్తే సెక్రటరీగారు ఆటోమేటిక్ గా సంతకం పెట్టేస్తారు... మీ ఋణం ఉంచుకోనులెండి" అన్నాడు చివరి వాక్యం నెమ్మదిగా.

"అబ్బే... మీరుంచుకుంటారని కాదు..." అని అంటూ మాట్లాడ్డం మాని చలపతి వేళ్ళకున్న ఉంగరాలవంక చూడ సాగాడు ఉమాపతి.

"ఏమిటండీ చూస్తున్నారు?"

"అబ్బే... ఆ ఉంగరం బావుంది ఎక్కడ చేయించారు?.."

చలపతి గుండె గుభేల్ మంది. ఇంక వీడు తనను నిలువు దోపిడీ చేసేటట్లున్నాడని అనుకున్నాడు.

"ఉంగరం మీకు నచ్చిందా?... మీక్కావాలా?"... అని అడిగాడు మనసులో తిట్టుకుంటూనే వేలికున్న ఉంగరాన్ని తీస్తూ.

ఉమాపతి సెక్షను నలుమూలలా చూశాడు.

"మీ ఇంటికి సాయంత్రం వస్తాలెండి..." రహస్యంగా అన్నాడు చలపతి ఉంగరాన్ని మళ్లీ వేలికి తొడిగేసుకుంటూ.

"మీలాగా చాలామంది వచ్చారు. వాళ్లందర్నీ వదిలేసి ఈ కాంట్రాక్టు మీకే ఇవ్వాలంటే దానికి బలమైన కారణం

చూపించాలి... మీరు వేసిన ఎప్పిమేటుకూడా తక్కువేం లేదు. మీపని కావడం చాలా కష్టం అనుకుంటున్నాను...'' అన్నాడు ఉమాపతి చలపతి వేలికున్న ఉంగరాన్ని చూస్తూ.

"అమ్మమ్మ... మీరలా అంటే కష్టం... మీ ఋణం ఉంచుకోనండీ... అన్నట్టు మీకు ఈ ఉంగరం బాగా నచ్చిందనుకుంటాను... తీసుకోండి'' వేలికున్న ఉంగరాన్ని తీసి అటూ ఇటూ చూసి ఉమాపతికి ఇచ్చాడు.

ఉమాపతి దాన్ని తక్కున తీసుకుని డ్రాయరు సొరుగులో పడేశాడు.

''ఆ... అయినా బంగారాన్ని ఏం చేసుకుంటామండీ... రేపొద్దున్న మావాడి కాలేజీ ఫీజు కట్టాలి, మా ఆవిడకు మందులు కొనాలి... ఇంటిలో సమస్యలతో, ఆఫీసులో ఫైళ్ళ మధ్యా నలిగిపోతుంటే ఇంకా వేళ్లకు ఉంగరాలవీ పెట్టుకుని షోకు చేసుకునే సర్దా ఎక్కడుంటుందండీ...'' ఉమాపతి ఉస్సురంటూ నిట్టూర్చాడు.

చలపతి బ్యాగ్‌లోంచి ఒక పొడుగాటి కవరుతీసి ''ఇది ఉంచండి" అంటూ ఉమాపతికి అందించబోయాడు. ఉమాపతి దాన్ని అందుకోకుండా.

''ఎంత?'' అని అడిగాడు.

''మూడువేలు!...''

''ఇంతేనా?... మీకు నేను చేసిపెట్టే పనివల్ల లక్ష లాభం వస్తుంది... మీపని కావాలంటే నేను ఎంత కష్టం..."

ఉమాపతి మాటలు పూర్తిచెయ్యనివ్వకుండా చలపతి మరో రెండువేలు కవరులో పెట్టి అందించాడు.

"ఇంక ఇంతకంటే ఎక్కువిచ్చుకోలేను.... దయుంచాలి" చేతులు జోడించాడు చలపతి. ఉమాపతి అభయహస్తం ఇచ్చాడు.

"ఎండలో చాలా అలసిపోయి వచ్చినట్లున్నారు రండి... అలా వెళ్ళి కూల్ డ్రింక్స్ తాగివద్దాం..." అంటూ చలపతిని కూల్ డ్రింక్స్‌షాప్‌కి తీసుకెళ్ళాడు ఉమాపతి. ఇద్దరూ బాదం ఖీర్ తాగారు బిల్లు చలపతే చెల్లించాడు. మరోసారి తన పనిగురించి హెచ్చరించి ఉమాపతి భుజం తట్టి సెలవు తీసుకుని ఆటో ఎక్కి వెళ్ళిపోయాడు చలపతి తనదగ్గర డబ్బు తీసుకోగానే ఉమాపతి భుజంతట్టే ధైర్యం వచ్చింది చలపతికి.

ఉమాపతి వచ్చి సీటులో కూర్చున్నాడు. నెమ్మదిగా డ్రాయరు సొరుగు తెరిచి చలపతి ఇచ్చిన ఉంగరాన్ని ఒకసారి తృప్తిగా చూసుకున్నాడు, చలపతి ఇచ్చిన కవరుకూడా తీసి జాగ్రత్తగా తన బ్యాగ్‌లో పెట్టిదాన్ని డ్రాయరులో ఉంచి తాళంవేశాడు.

అయిదువేలు!... కష్టపడి అయిదారు నెలలు చెమటోడ్చి ఆఫీసులో పనిచేస్తే వచ్చే అయిదువేలను తను కేవలం ఒక్క సంతకంతో సంపాదించాడు. తనకెప్పుడూ చిన్నకేసులే తగుల్తాయి. వాళ్ళు మూడు నాలుగు వందలకంటే ఎక్కువ ఇవ్వరు. ఇట్లాంటి కేసులు సంవత్సరానికి రెండు మూడు కంటే ఎక్కువ తగలవు. తగిలినప్పుడే అవకాశం వినియోగించుకోవాలి.

ఉమాపతి హుషారుగా ఈల వేస్తూ ఫైలుతీసి, చలపతికే కాంట్రాక్టు ఇవ్వాల్సిందిగా నోట్ వ్రాసి ఫైలును ప్రక్కకు పెట్టి మరోసారి డ్రాయరు తెరిచి ఉంగరం తీసి వేలికిపెట్టుకుని చెయ్యివంక చూసుకున్నాడు. ఆ ఉంగరం పెట్టుకోగానే తన చేయి తనకే అందంగా కనపడసాగింది. ఇంటికి వెళ్ళేటప్పుడు తను ఈ ఉంగరం పెట్టుకోవాలి. జానకి కాఫీ ఇచ్చేటప్పుడు తను జానకికి ఉంగరం కనపడే విధంగా కప్పును అందుకోవాలి. జానకి "అబ్బ...ఉంగరం చాల బావుంది!...ఎక్కడిదండీ?..." అని అడుగుతుంది. తను చెప్తాడు. అప్పుడు జానకి మూతి ముడుచుకుంటుంది. "మీ గురించి మీరు చూసుకుంటారుగానీ నాగురించి ఎప్పుడైనా ఆలోచించారా?..." అని తనను దెప్పుతుంది. ఎప్పటినుండో తనను అడుగుతున్న నగకొనలేదని. అప్పుడు తను చలపతియిచ్చిన అయిదువేలు ఆమె చేతిలోపెట్టి "నీకిష్టం వచ్చిన నగ కొనుక్కో" మని అంటాడు. అప్పుడు జానకి ఎగిరి గంతేస్తుంది. పట్టరాని సంతోషంతో తనను కౌగిలించుకుని ము......

"సార్...మిమ్మల్ని అయ్యగారు పిలుస్తున్నారు" ప్యూన్ పిలుపుతో ఈలోకంలో పడ్డాడు ఉమాపతి.

చేతికున్న ఉంగరం తీసి డ్రాయరులో పెట్టి తాళంవేసి చలపతిఫైలుతో సెక్రటరీ రూములోకి అడుగుపెట్టాడు ఉమాపతి.

"రావోయ్...కూర్చో" అన్నాడు సెక్రటరీ రంగారావు.

ఎన్నడూలేని రంగారావు మర్యాదకు ఉమాపతి ఆశ్చర్యా

పోయాడు. రంగారావు టేబులు ముందున్న కుర్చీ చివర్న కూర్చున్నట్లు కూర్చున్నాడు.

"నిన్న నేను త్వరగా పూర్తిచేసి పట్టుకురమ్మన్న అర్జంటుఫైలు మాట ఏం చేశావ్?... ఆఫైలుగురించి ఇప్పుడే చీఫ్ సెక్రటరీ గారు నాకు ఫోన్ చేశారు" కుర్చీవెనక్కు జారబడుతూ అడిగాడు రంగారావు.

ఉమాపతి తనకుర్చీలో మరింతగా ముందుకు వంగుతూ "ఆ ఫైలు నిన్న సాయంతమే పూర్తి చేశాను సార్... ఇప్పుడే వెళ్ళి తెస్తాను..." అని కుర్చీలోంచి లేవబోయాడు.

"ఆ ఫైలు తేలేదా?...మరి నీచేతిలోని ఫైలేమిటి?... రంగారావు కళ్ళు చిట్లించి అడిగాడు.

ఉమాపతి మాట్లాడకుండా చటుక్కున ముందుకు వంగి సంతకం కోసం రంగారావు ముందు ఆ ఫైలును ఉంచాడు.

రంగారావు ఉమాపతి వ్రాసిన నోటింగ్ చదివి "అయితే చలపతికే కాంట్రాక్టు ఇద్దామంటావ్?... సరే అట్లాగే కానిద్దాం... అనిఫైలుమీద సంతకం పెట్టాడు. ఉమాపతి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

"ఇందాక నేను కేంటీన్‌కి వెళ్తూ చలపతి నువ్వు కలిసి కూల్‌డ్రింక్స్ షాపుకి వెళ్ళడం చూశాను..." అన్నాడు రంగారావు ఉమాపతి కళ్ళలోకి చూస్తూ. ఉమాపతి మొఖం పాలిపోయింది.

"మీకు బంధువా?..."

"అబ్బే కాదండీ..." అతి కష్టం మీద అన్నాడు ఆ మాటల్ని. అతని గొంతు తడారిపోయింది.

"ఏమైనా ఇచ్చాడా? ." ముందుకు వంగి ఉమాపతి ముఖంలోకి సూటిగా చూస్తూ అడిగాడు రంగారావు. అతనంత సూటిగా అడిగేసరికి ఉమాపతి తికమక పడిపోయాడు ఏం చెప్పాలో తెలీలేదు. కాని అతను చెప్పకముందే అతని ముఖాన్ని చూసి సంగతి తెలుసుకున్నాడు రంగారావు.

"పోనీలే....నీకు యిష్టం లేకపోతే చెప్పొద్దు...,.అన్నట్లు నీకు చెప్పాల్సిన విషయం ఒకటుంది....మీ సెక్షనులో రామనాథం లేడూ...అతను వారంనుండీ ప్రతిరోజు ఒకటే గోల పెడుతున్నాడు. అతన్ని నీ సీటులోకి మార్చాలట!...."

ఉమాపతి గుండెల్లో రాయి పడింది. 'వెధవ!....తనను దోచడానికేదో ప్లాన్ వేశాడు.'

"ఏమిటాలోచిస్తున్నావ్?... పాపం...రామనాథం తన కూతురు పెళ్లి చెయ్యాలట!...ఇంకా అతను చాలఇబ్బందుల్లో ఉన్నట్లు చెప్పాడు..."అన్నాడు వక్రంగానవ్వుతూ రంగారావ్.

ఉమాపతి నీరసించిపోయాడు. తను ఇప్పుడున్న సీటు మారితే తనచేతికి చిప్పే! ఉమాపతి చిత్తుగా ఓడిపోయాడు

"అన్నట్లు చెప్పడం మర్చిపోయాను... చలపతి మీకు ఇవ్వమని ఒక కవరిచ్చాడు నసుగుతూ చెప్పాడు ఉమాపతి.

"మరి తీసుకురాలేదేం?..." రంగారావ్ కళ్ళు మెరిశాయ్.

"మీరు పిలుస్తే కంగారుగా వచ్చేశాను. ఇప్పుడే తెచ్చిస్తాను..." అంటూ గబగబా రూము బయటకు పరుగు లాంటి నడకతో వెళ్లిపోయాడు.

"హు... నాదగ్గరా వీళ్ళ నాటకాలు?." నవ్వుకున్నాడు రంగారావ్.

ఉమాపతి మళ్ళీ అదే పరుగు లాంటి నడకతో రూములోకి వచ్చి రంగారావు చేతిలో ఒక కవరు పెట్టాడు. రంగారావు కవరులోని కాగితాలు లెక్క పెట్టాడు.

'ఇంతేనా?... ఇంకేమైనా?..."

'అంతేనండి... నాక్కూడా కొన్ని ఇబ్బందులున్నాయండి... ఆ సీటులోంచి మారాలంటే చాల కష్టమండి...' నీరసంగా అన్నాడు ఉమాపతి.

'మరేం ఫరవాలేదు... ఆ రామనాథానికి ఏదో సర్ది చెప్తానులే... అసలు ఆ సీటులో నీలాంటి సామర్ధ్యంగల వారు ఉండాలి. ఆ రామనాథానికి ఏ పనీ సరిగ్గా చేతకాదు. నువ్వేమీ భయపడనవసరం లేదు... ఇంక నువ్వెళ్ళొచ్చు...' అన్నాడు రంగారావు సిగరెట్ పొగని విలాసంగా వదులుతూ. ఉమాపతి బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

"హు... పిల్లకాకి..." నవ్వుకున్నాడు రంగారావ్.

సాయంత్రం అయిదు గంటలైంది. ఆరోజు ఛీఫ్ సెక్రటరీ రూములో అందరు సెక్రటరీల మీటింగు ఉంది. రంగారావు ఫైళ్ళన్నీ సర్ది ఛీఫ్ సెక్రటరీ రూమ్‌కు వెళ్ళాడు. సెక్రటరీ

మీటింగు అయ్యేసరికి రాత్రి పదు గంటలయింది. అందరూ వెళ్ళిపోయే సమయంలో ఛీఫ్ సెక్రటరీ రంగారావును పిలిచి ఒక ఫైలు ఇచ్చి "దీన్ని ఇప్పుడే పూర్తిచేసి ఇవ్వండి. మినిష్టర్ గారికి అర్జంటుగా సబ్మిట్ చెయ్యాలి. మీరు ఫైలు పూర్తిచేసిన తరువాత నేను సంతకం పెట్టి మినిష్టర్ గారింటికి ఈవేళే ఎంత రాత్రయినా పంపించాలి'' అన్నాడు.

రంగారావు తన గదికి వెళ్ళి ఒక అసిస్టెంట్ సెక్రటరీ ఒక యు. డి. సి. సహాయంతో పాత రికార్డులన్నీ తెప్పించి వాటిని తిరగేసి ఫైలు పూర్తిచేసి టైపిస్టుచేత నోటింగ్స్ టైపు చేయించి ఛీఫ్ సెక్రటరీకి అందజేసేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలైంది.

రంగారావు ఛీఫ్ సెక్రటరీ దగ్గర శలవు తీసుకుని ఇంటికి బయలుదేరాడు. అతని బ్యాగ్ బరువుగా ఉంది. ఉమాపతి ఇచ్చిన అయిదు వేలూ అందులో ఉన్నాయి. బ్యాగ్‌ని విలాసంగా ఊపుతూ నడుస్తున్నాడు. రంగారావు-ఇల్లు ఆఫీసుకు 2 ఫర్లాంగుల దూరంలో ఉంది. సందులోంచి ఇంటికి వెళ్ళాలి. రాత్రి తొమ్మిది కావడంవల్ల రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. రంగారావు మర్నాడు తను వెళ్ళబోయే రేసుల గురించి ఆలోచిస్తున్నాడు. అయిదువేలూ పట్టుకెళ్ళి ఎక్కువ కాంబినేషన్స్ వేసి జాక్‌పాట్ టికెట్స్ కొంటే తనకు తప్పకుండా జాక్‌పాట్ తగులుతుంది. బుక్కీస్ దగ్గర ఫ్లూక్ హార్సులమీద కూడా ఎక్కువగా ఆడాలి. రేపు తప్పకుండా రేసులమీద ఆడితే తనకు చాలా డబ్బు వస్తుంది. ఈసారి వారఫలాల్లో కూడా ఆదివారం తనకు శుభదినంగా - అనుకోని విధంగా

డబ్బు కలిసి వస్తుందని వ్రాసి ఉంది...తనకు రేసుల్లో వచ్చే డబ్బు గురించి ఆలోచించేకొద్దీ రంగారావులో హుషారు మరింతగా పెరిగింది. అతను ఈల వేసుకుంటూ బ్యాగ్ మరీ జోరుగా వూపుతూ నడుస్తున్నాడు. ఇంతలో వెనుకనుండి ఒక మోటార్ సైకిల్ వేగంగా వచ్చింది. రంగారావు ప్రక్కగా వెళుతున్నప్పుడు వేగం తగ్గించి దానిమీద ఉన్న మనిషి రంగారావు చేతిలోని బ్యాగ్ లాక్కుని వేగంగా మోటార్ సైకిల్ మీద వెళ్ళిపోయాడు. రంగారావు నెత్తీనోరు కొట్టుకుంటూ "హెల్ప్... హెల్ప్..." అని అరిచాడు. ఆ నిర్మానుష్య వీథిలో అతని అరుపులు వినేవారు లేరు. మోటార్ సైకిల్ మీద కూర్చున్న నాగరాజు చిరునవ్వు నవ్వుకున్నాడు. మోటార్ సైకిల్‌ను ఒక బార్ ముందు ఆపి లోపలికి వెళ్ళాడు. విస్కీ, తందూర్ చికెన్‌కి ఆర్డరు ఇచ్చి బ్యాగ్ తెరచి చూశాడు. నాగరాజు కళ్ళు మెరిశాయి. గబగబా నోట్లను లెక్క పెట్టాడు.

అయిదు వేలు!!...

ఓహ్... ఈరోజు తనకెంత మంచిరోజు... ఈవేళ రాత్రి తను జల్సా చేయాల్సిందే... మెహందీకి వెళ్ళాలి...

చికెన్ తిని బేరర్ తెచ్చిన బిల్లు తీసుకుని వాడికి పది రూపాయలు పడేసి, బేరర్ తెల్లబోయి చూస్తుండగా బార్ బయటికి అడుగులు వేశాడు నాగరాజు.

మెహందీలోని ఆ సందులో ఒక యింటి ముందు మోటార్ సైకిల్ ఆపి ఒక ప్రక్కగా పెట్టి వెళ్ళి తలుపు తట్టాడు. తలుపు కొద్దిగా తెరుచుకుంది.

"నేను నాగరాజుని!!..."

తలుపు పూర్తిగా తెరుచుకుంది. నాగరాజు లోపలికి వెళ్ళాడు.

"ఏమిటీ మధ్య మరిదిగారు కనపడ్డం మానేశారు..." అంది నాగరత్నం వెకిలిగా నవ్వుతూ తన లావుపాటి శరీరాన్ని వయ్యారంగా ఊపడానికి ప్రయత్నిస్తూ.

"నిన్నెక్కడ చూడాల్సి వస్తుందోనన్న భయంతో రావడంలేదు."

"మరిదిగారు భలే సరసాలాడ్తారు... ఉండండి...దాన్ని పిలుస్తాను. . ఒసే పంకజం... పంకజం. ." నాగరత్నం వెనక్కు తిరిగి పిలవసాగింది.

"పంకజం వద్దు...ఈవాళ ఇకా స్తమంచి సరుకుకావాలి" నాగరాజు విలాసంగా పొగ వదులుతూ అన్నాడు.

"చాలా జోరుగా ఉన్నట్లున్నావే?...సావిత్రీ... సావిత్రీ ..." అంటూ పిలిచింది నాగరత్నం. గజ్జల గుర్రంలా ఉన్న సావిత్రి వచ్చింది. సావిత్రినిచూసిన నాగరాజు కళ్ళుమెరిశాయ్.

సావిత్రి నాగరాజును గదిలోనికి తీసుకెళ్ళింది. గది తలుపులు మూసుకున్నాయి. కాస్సేపటికి గది తలుపులు తెరచుకున్నాయి. సావిత్రి చేతిలో పొడుగాటి కవరు!!...

"బాగా త్రాగించేశాను... మత్తుగా పడుకున్నాడు. ఈ కవరులో నాలుగు వేలున్నాయి..." నాగరత్నం చేతికి కవరు అందించింది సావిత్రి.

నాగరత్నం ముఖం వెలిగిపోయింది.

"మెలుకువ వచ్చిన తరువాత ఒకవేళ బ్యాగ్ చూసు కుని గొడవ చేస్తేనో?" సావిత్రి తన సందేహాన్ని వెలిబుచ్చింది.

నాగరత్నం ఒకమూలగా నిలుచుని బీడీ కాలుస్తున్న కండలు తిరిగిన రౌడీ హుస్సేన్ వైపు చూసింది. సావిత్రికి అర్థం అయింది .. తను వెయ్యి రూపాయలు కవరులోంచి తీసి దాచుకున్న విషయం నాగరత్నానికి తెలియనందుకు నవ్వుకుంది.

నాగరత్నం విలాసంగా నడుస్తూ హాల్లోకి - సావిత్రి గది లోకి వెళ్ళిపోయారు.

వాకిటిలో మోటార్ సైకిల్ ఆగినశబ్దం వినిపించి కిటికీ తలుపు తెరచి వీథిలోకి తొంగి చూసింది నాగ రత్నం, మోటార్ సైకిల్ తాళంవేసి వరండావైపు వస్తున్నాడు ఇనస్పెక్టర్ శివరాం.

"శనిగాడు...మళ్ళీ దాపురించాడు. వీడికిప్పుడు ఎంత ముడుపు చెల్లించాలో!" అనుకుటూ తలుపుతీసి "రండి... రండి మీ రాకతో మాగృహంపావనమైంది..." అంటూ ఇనస్పెక్టర్ శివరాంని ఆహ్వానించింది నాగరత్నం.

ఎప్పటిలాగానే తెల్లవారింది. సాంబయ్య గుడిసెలోంచి బయటకు వచ్చి రిక్షా తీసుకుని రోడ్డుమీద పడ్డాడు.

"ఇస్ ...ఎదవ ఎండ..." అనుకున్నాడు. నొసటిమీద పట్టిన చెమటను ఎడమ చేత్తో తీసి ప్రక్కకు విదిలించాడు.

"ఎండనేదు వాన్నేదు...రిచ్చా తొక్కాల్సిందే. దేవుడు పెత్యెచ్ఛమై వచ్చే జలమలో నిన్నేటిగా పుట్టించాల అనడిగితే రిచ్చా తొక్కే వోడిగా మాత్రం పుట్టించకు అని అడుగుతా నాపై తే...ఎదవ బతుకు...ఎదవ..," అనుకున్నాడుసాంబయ్య.

"ఏయ్ రిక్షా..." ఫుట్ పాత్ మీదినుండి ఎవరో పిలిచారు. చిన్న చేప రిక్షా లాక్కుంటూ పెద్దచేప దగ్గరికి వెళ్ళింది.

1978, చక్రవర్తి